## నేడు జాబ్‌మేళా

**శ్రీకాకుళం అర్బన్ :** నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో నోడల్ జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జెకెసి) ఆధ్వర్యాన ఈనెల తొమ్మిదో తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వి.ఎస్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో పశ్చిమగోదావరి జిల్లాలోని త్రివేణి రెన్యువల్స్ ప్రైవేట్ లిమిటెడ్, సోలార్ గ్లాస్ మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఆయా కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. బిఎస్‌సి కెమిస్ట్రీ, కెమికల్, ఫిజిక్స్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, రవాణాతో పాటు సిటిసి స్టైఫండ్ కింద రూ.13 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ పూర్తి బయోడేటా, ధ్రువపత్రాలతో ఉదయం పది గంటలకు ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో హాజరు కావాలని సూచించారు.

# జెట్టీ... ఒట్టి మాటేనా..?

- అసంపూర్తిగా మంచినీళ్లపేట జెట్టీ
- పట్టాలెక్కని ఇతర నిర్మాణాలు
- భూసేకరణకే పరిమితమైన బుడగట్లపాలెం హార్బర్
- మత్స్యకారుల్లో సాగుతున్న వలసల పరంపర

**జిల్లాలో 193 కిలోమీటర్ల మేర విశాలమైన సముద్రతీరం ఉంది. లక్షన్నరకు పైగా మత్స్యకార జనాభా ఉంది. సుమారు 50 వేల కుటుంబాలు చేపల వేట పైనే బతుకుతున్నారు. ఇంతటి అవసరాలు ఉన్నా జిల్లాలో ఒక్క హార్బరూ లేదు. ఒక్క జెట్టీకి దిక్కు లేకుండా పోయింది. టిడిపి అధికారంలో ఉన్నాళ్లు వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో జెట్టీ నిర్మిస్తామంటూ మాటలతోనే కాలక్షేపం చేసింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత మంచినీళ్లపేటతో పాటు ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్‌ను నిర్మిస్తామంటూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హామీనిచ్చారు. మూడున్నరేళ్ల కాలంలో ఏ ఒక్కటీ కార్యరూపం దాల్చలేదు. దీంతో వేట సరిగా మత్స్యకారుల్లో వలసల పరంపర కొనసాగుతునే ఉంది.**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో 11 తీరప్రాంత ప్రాంత మండలాల పరిధిలో 104 గ్రామాలు ఉన్నాయి. జిల్లాలో 1,46,192 మంది జనాభా, 46,580 కుటుంబాలు ఉన్నాయి. మూడు దశాబ్దాల కిందట వరకు ఇందులో 80 శాతం కుటుంబాలు చేపల వేటపై బతకగా మిగిలిన 20 శాతం కుటుంబాలు వ్యవసాయం, ఇతర వృత్తులు, కూలి పనులు చేసుకునే వారు. ప్రస్తుతం మత్స్యకారుల జీవన స్థితిగతులన్నీ తారుమారయ్యాయి. ఇందులో చేపల వేటకు వెళ్తున్న వారి సంఖ్య 13 నుంచి 15 వేలు మాత్రమే ఉంది. చేపల వేట సరిగా సాగక వేలాది మంది మత్స్యకారులు గుజరాత్, తమిళనాడు, మహారాష్ట్ర, గోవా, కేరళ రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు. అక్కడ బోటు యజమానుల వద్ద కూలీలుగా పనిచేస్తున్నారు.

గుజరాత్‌లోని ఒక్క వీరావల్ ప్రాంతంలోనే జిల్లాకు చెందిన మత్స్యకారులు సుమారు మూడు వేల మంది ఉన్నారు. జిల్లాలోని తీర ప్రాంతంలో చేపలు దొరక్కపోవడంతో వేలాది మంది మత్స్యకారులు ఏకంగా చేపల వేట మానుకుని ఇతర వృత్తుల్లోకి వెళ్లిపోయారు. రోడ్డు వెంబడి టోపీలు, ఊయలలు అమ్ముకుని బతుకుతున్నారు. మరికొందరు పెయింటింగ్ పనులు చేస్తున్నారు. కొంతమంది గ్రామాల్లోనే ఉంటూ ఆటోలు, ప్రయివేట్ వాహనాలకు డ్రైవర్లుగా వెళ్తున్నారు. ఇలా వేలాది మంది మత్స్యకారులు చేపల వేటకు దూరమవుతున్నారు.

### తీర ప్రాంతాల్లో కొరవడిన మౌలిక వసతులు

జిల్లాలో మత్స్య సంపదను నిల్వ చేసేందుకు ఎక్కడా కోల్డ్ స్టోరేజీలు లేవు. ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్, డి.మత్స్యలేశం, రాళ్లపేటలో జెట్టీ, కవిటి మండలం ఇద్దివానిపాలెంలో జెట్టీ, సోంపేట మండలం బారువలో జెట్టీ, వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవుల-మంచినీళ్లపేట జెట్టీ నిర్మాణం పనులు ముందుకు కదలడం లేదు. గతంలో బారువ, నువ్వలరేవు తదితర తీరాల్లో ఏర్పాటు చేసిన ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు అభివృద్ధికి నోచుకోవడం లేదు.

### ప్రస్తుత పరిస్థితి ఇలా...

వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో జెట్టీ నిర్మాణ ప్రతిపాదన చాలాకాలంగా ఉంది. అందులో భాగంగా వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఫిష్ లాండింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం రూ.13.95 కోట్లతో నిర్మాణ పనులు చేపట్టింది. కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన రూ.2.61 కోట్ల బిల్లులను చెల్లించకపోవడంతో పనులు ఆపేశారు. ఇప్పటివరకు 32 శాతమే పనులు పూర్తయ్యాయి. ఒప్పందం ప్రకారం ఈ ఏడాది మే 31వ తేదీ లోగా పనులు పూర్తి కావాల్సి ఉంది. ప్రస్తుత పరిస్థితిని పరిశీలిస్తే, పనులు పూర్తిస్థాయిలో కావడానికి కనీసం ఏడాదికి మించి సమయం పట్టే అవకాశం ఉంది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మించాలని నిర్ణయించింది. భూసేకరణ పనులు మినహా ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం రూ.332.09 కోట్లతో ప్రభుత్వం డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును రూపొందించింది. ప్రస్తుతం నిర్మాణానికి అవసరమైన 40.88 ఎకరాల భూమిని సేకరించారు.

టర్కీలో జిల్లాకు చెందిన యువకులు

## టర్కీలో సిక్కోలువాసులు క్షేమం

మెయిన్ పేజీలో

## వేతన సవరణ చేయాలి

### బిఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బిఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులకు 2017 జనవరి ఒకటో తేదీ నుంచి 17 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ చేయాలని బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.గోవర్ధనరావు, పి.వెంకటరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాయింట్ ఫోరం ఆఫ్ బిఎస్‌ఎన్‌ఎల్ నాన్ ఎగ్జిక్యూటివ్ యూనియన్స్ పిలుపు మేరకు నగరంలోని సంచార భవన్ వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే వేతన సవరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అధికారులతో సమానంగా కిందిస్థాయి ఉద్యోగులకు ఐదేళ్లకోసారి ఉద్యోగోన్నతులు కల్పించడం ద్వారా సర్వీస్‌లో ఐదు ఉద్యోగోన్నతులు అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన బిఎస్‌ఎన్‌ఎల్‌ను అభివృద్ధి చేయడానికి బడ్జెట్ ద్వారా తగినన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సంస్థ పరిధిలో ఇప్పటివరకు 3జి సేవలనే కొనసాగిస్తున్నారని, దానివల్ల పోటీ సంస్థలకు ఆదాయ వనరులు తరలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 4జి విస్తృతం చేయాలని, 5జి సేవలను ప్రారంభించాలన్నారు. ధర్నాకు పోస్టల్ ఉద్యోగుల సంఘం నాయకులు చంద్రశేఖర్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎస్.అభిమన్యు, యు.సురేష్, ఎఐబిడిపిఎ నాయకులు హెచ్.విశ్వేశ్వరరావు, వి.శ్రీనివాసరావు, కె.గోపాలరావు, ఆర్.నాగమణి, పాణిగ్రహి తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న బిఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులు

విద్యార్థులను అభినందిస్తున్న ఎజిఎం నర్సునాయుడు తదితరులు

## జెఇఇ మెయిన్స్‌లో ప్రతిభ

### ఉత్తమ పర్సంటైల్ సాధించిన పలువురు విద్యార్థులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జెఇఇ మెయిన్స్ మొదటి సెషన్ ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. మెరుగైన పర్సంటైల్ సాధించి తదుపరి పరీక్షకు సిద్ధమవుతున్నారు. వడ్డి సంప్రీత్ (హాల్ టికెట్ నంబరు ఎపి 14000316) 99.66 పర్సంటైల్ సాధించారు. భవేష్ భార్గవ్ కొరారికి (హాల్ టికెట్ నంబరు ఎపి 14000491) 99.30 పర్సంటైల్ వచ్చింది. దేవాన్ష్ నాయక్ (హాల్ టికెట్ నంబర్ ఎపి 1400022) 98.50 పర్సంటైల్ సాధించారు. సుంకర రోహిత్ (హాల్ టికెట్ నంబర్ ఎపి 14001129) సాధించారు. వీరంతా శ్రీకాకుళంలోని శ్రీచైతన్య విద్యాసంస్థలో ఇంటర్ అభ్యసించారు. మంచి పర్సంటైల్ సాధించిన విద్యార్థులకు ఎజిఎం నర్సునాయుడు, డీన్ మురళీధర్, ఐఐటి క్యాంపస్ ప్రిన్సిపల్ ఆర్.కృష్ణ అభినందించారు.

## జాతీయ నూతన విద్యా విధానంతో చేటు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం-2020 ప్రభుత్వ విద్యారంగానికి చేటు చేస్తుందని విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు అన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యాన కలెక్టరేట్‌లోని జ్యోతిరావుబాయి పూలే పార్కు వద్ద మంగళవారం చేపట్టిన ధర్నాను ఎపిటిఎఫ్ (1938) రాష్ట్ర సహాధ్యక్షులు చింతాడ దిలీప్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విధానం విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలు మరింత జఠిలం కావడానికి దోహదపడుతుందన్నారు. డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కొమ్ము అప్పలరాజు మాట్లాడుతూ విద్యా వ్యాపారాన్ని మరింత ప్రోత్సహించేందుకు జాతీయ విద్యా విధానం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలకు ఉచితంగా విద్యను అందించడం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. ఆ బాధ్యత నుంచి తప్పుకుంటూ ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసేందుకు పెద్దఎత్తున కుట్ర సాగుతోందని విమర్శించారు. నూతన విద్యా విధానాన్ని ప్రజలు అడ్డుకోకపోతే పేదలు చదువుకు దూరం కాక తప్పదన్నారు. కెఎన్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు బెలమర ప్రభాకరరావు మాట్లాడుతూ దళిత, బలహీన వర్గాల బాలబాలికలు తమ కుల వృత్తుల్లోనే కూరుకుపోవడానికి ఈ విధానం దారిచూపుతుందన్నారు.

పాఠశాలలకు దూరం చేస్తూ, ఉపాధ్యాయులు లేని ఆన్‌లైన్ చదువులను వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. పాఠశాలలకు రంగులు వేశామని గొప్పలు చెప్పుకుంటున్న జగన్ ప్రభుత్వం, మూడున్నరేళ్లలో ఎన్నో పాఠశాలలను మూసివేసిందని విమర్శించారు. ఒక్క ఉపాధ్యాయ పోస్టు నియామకం చేపట్టలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే పేద, దళిత, బహుజన, మైనార్టీలు వివక్షకు గురవుతున్నారని చెప్పారు. ఎపిటిఎఫ్ (1938) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాన కామేశ్వరరావు, టెంక చలపతిరావు మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం 2020 అమలు కావడం వల్ల ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల ప్రవేశాల విషయంలో రిజర్వేషన్లను ప్రస్తావించకపోవడంతో సామాజిక న్యాయానికి తూట్లు పొడిచే పరిస్థితి నెలకొందన్నారు. డిటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కోత ధర్మారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జి.గోపాలరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కృష్ణారావు మాట్లాడుతూ జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ధర్నాలో కెఎన్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి జగన్నాథం, సహాయ కార్యదర్శి ఆర్.రాంబాబు, డిటిఎఫ్ జిల్లా కార్యదర్శి పూజారి హరిప్రసన్న, ఎపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దిలీప్‌కుమార్

## ఈ-క్రాప్ నమోదు వేగవంతం

### కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - జి.సిగడాం

ఈ-క్రాప్ నమోదును వేగవంతం చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. మండలంలోని జి.సిగడాం, పెంట, పాలఖండ్యాంలో ఈ-క్రాప్ నమోదును మంగళవారం పర్యవేక్షించారు. క్షేత్రస్థాయికి వెళ్లి పంటలను పరిశీలించారు. పెంట, జి.సిగడాం పంచాయతీల్లో రైతులతో మమేకమయ్యారు. ఈ-క్రాప్ నమోదు గురించి రైతులకు, వ్యవసాయ సహాయకులకు వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పప్పల వేణుగోపాలరావు, మండల వ్యవసాయ అధికారి శారద, వ్యవసాయ సహాయకులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పాలఖండ్యాంలో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

## రేపు టిడిపి విస్తృతస్థాయి సమావేశం

**పలాస :** తెలుగుదేశం పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఈనెల తొమ్మిదో తేదీన ఉదయం పది గంటలకు నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.

మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

## సంక్షేమంలో కొత్త ఒరవడి

- ఏ ప్రభుత్వంలోనూ ఇన్ని పథకాలు లేవు
- జగన్ జనరంజక పాలన
- వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

సంక్షేమ పథకాల విషయంలో వైసిపి ప్రభుత్వం కొత్త ఒరవడి సృష్టించిందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలోని ఒక కళ్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన కన్వీనర్లు, గృహ సారథుల శిక్షణా తరగతుల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో జనరంజక పాలనను అందిస్తున్నారని కొనియాడారు. గ్రామాలు, వార్డుల్లో సంక్షేమ పాలన అర్థమయ్యే విధంగా ప్రజలకు వివరించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని కన్వీనర్లు, గృహ సారథులు పనిచేయాలన్నారు. జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా మళ్లీ గెలిపించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాల ఫలాలు గడప గడపకు అందుతున్నాయన్నారు. తన రాజకీయ జీవితంలో ఏ ప్రభుత్వ హయాంలోనూ ఇన్ని పథకాలు ప్రజలకు అందలేదని అన్నారు. ముఖ్యమంత్రి ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, సచివాలయాల కోఆర్డినేటర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, దుంపల శ్యామలరావు, బొడ్డేపల్లి అజంతా కుమారి, బొడ్డేపల్లి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


మరిన్ని వార్తల కోసం
epaper.prajasakti.com


## ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తాం

- కృష్ణదాస్‌తో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి
- జిల్లా రాజకీయాలపై సుదీర్ఘ చర్చ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రైతన్నకు ఎలాంటి కష్టం లేకుండా ఖరీఫ్‌లో పండించిన చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తామని ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి స్పష్టమైన హామీనిచ్చినట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ చెప్పారు. తాడేపల్లిలోని సిఎం నివాసంలో తనయుడు కృష్ణచైతన్యతో కలిసి మంగళవారం ముఖ్యమంత్రిని కలిశారు. జిల్లా రాజకీయాలు, పలు అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రితో మాట్లాడి స్పష్టమైన హామీ తీసుకున్నట్లు వివరించారు. జిల్లాలో ఇప్పటికే 4.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, మరో 1.50 లక్షల టన్నుల ధాన్యం రైతుల దగ్గర ఉండిపోయిందని, వారికి కష్టం కలగకుండా చూడాలని కోరిన మేరకు ముఖ్యమంత్రి పై విధంగా స్పందించారని చెప్పారు. వంశధార నిర్వాసితులకు చెల్లించాల్సిన సుమారు మరో రూ.25 కోట్లను సైతం విడుదల చేస్తామని హామీనిచ్చారని తెలిపారు. సారవకోట మండలం బొంతు ఎత్తిపోతల పథకానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.40 కోట్లను త్వరలోనే విడుదల చేసి మొదటి దశ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, ఈ ఏడాది చివరికి నీటిని విడుదల చేసి తీరుతామన్నారు.

పాతపట్నం నియోజకవర్గ పరిధిలో 170 గ్రామాలకు ఉద్దేశించిన మంచినీటి వాటర్ గ్రిడ్ పథకం పనులను సైతం వేగవంతం చేస్తామని చెప్పారని తెలిపారు. రూ.50 కోట్లతో నిర్మిస్తున్న పలాస సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి పనులు 70 శాతం పూర్తయ్యాయని, ఈ ఏడాదికే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీనిచ్చారని చెప్పారు. రూ.700 కోట్లతో నిర్మాణం చేసుకుంటున్న ఉద్దానం మంచినీటి పథకాన్ని వచ్చే ఏడాదికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని హామీనిచ్చారని తెలిపారు. జిల్లా అభివృద్ధిపై ముఖ్యమంత్రి ఎంతో స్పష్టమైన విజన్‌తో ఉన్నారని ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ భేటీలో పలు రాజకీయ అంశాలూ చర్చకు వచ్చాయని చెప్పారు.

## నేటి నుంచి ఎఫ్ఎ-3 పరీక్షలు

ప్రజాశక్తి - టెక్కలి

ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్-3 పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే పరీక్షలు రోజుకు రెండు చొప్పున జరుగనున్నాయి. ఉదయం 9, 10వ తరగతి విద్యార్థులకు రెండు పరీక్షలు నిర్వహించనుండగా, మధ్యాహ్నం 6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు రెండు సబ్జెక్టుల మీద పరీక్షలు జరుగనున్నాయి. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఉదయం పూట మాత్రమే పరీక్షలు నిర్వహించనున్నారు. ఈసారి సిబిఎ విధానంలోనే పరీక్షలు నిర్వహిస్తున్నారు.

విద్యార్థులకు జవాబు పత్రాలుగా ఒఎంఆర్ షీట్‌లు ఇవ్వనున్నారు. ఒకటో ఫార్మేటివ్ పరీక్షల మాదిరిగానే ఈ పరీక్షలనూ నిర్వహించనున్నారు. రెండో ఫార్మేటివ్ పరీక్షల ప్రశ్నాపత్రాలు ఇచ్చి కాగితాల మీద రాయించిన విద్యాశాఖ, మళ్లీ ఎఫ్ఎ-3 పరీక్షలకు ఒఎంఆర్ విధానంలో నిర్వహిస్తోంది. పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు, విద్యార్థులు రాసే ఒఎంఆర్ షీట్‌లు ఇప్పటికే పాఠశాలలకు చేరాయి.

ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఒఎంఆర్ షీట్ ద్వారా పరీక్ష రాసేందుకు అలవాటు అయినా, ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఆ విధానంపై అవగాహన ఏర్పడలేదు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులే జవాబు పత్రాలను నింపాల్సిన పరిస్థితి ఉంటోంది. ఏకోపాధ్యాయ పాఠశాలల ఉపాధ్యాయుల పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది. ఒకవైపు యాప్‌లు అప్‌లోడ్ చేసుకుంటూనే, మరోవైపు విద్యార్థులతో ఒఎంఆర్ షీట్ నింపించే బాధ్యత వారి పైనే ఉంది.


**బహిరంగ వేలం ప్రకటన**

**మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు శ్రీకాకుళం**

**E.P. 27/2019 IN O.S. 262/2016**

Between:
శ్రీమతి K. అరుణకుమారి ..DHR/Plaintiff
And
1. బలగ శ్రీనివాసరావు (Since Died)
2. బలగ ధనలక్ష్మి ..JDR/Defendants

పై నెంబరు అమలు పిటీషన్లో డిక్రీ హోల్డర్కు రావల్సిన అమలు మొత్తం పైకం వగైరాలు రాబట్టుకొనే నిమిత్తం ప్రతివాది/జడ్జిమెంట్ డెటార్ తాలుక ఈ దిగువ షెడ్యూల్ దాఖలు స్థిరాస్తి వేలం వేయుటమూలంగా రాబట్టమని కోరుచూ పై అమలు దఖలు చేసియున్నారు. సదరు అమలు పిటీషన్లో శ్రీ కోర్టు వారు జడ్జిమెంట్ డెటార్ తాలుకా దిగువ షెడ్యూల్ ఆస్థిని **తేది: 23-02-2023** పగలు గం. **10-30** ని॥ నుండి పై కోర్టులో వేలం జరుపుటకు నిర్ణయించియున్నారు. కావున సదరు బహిరంగ వేలంలో పాల్గొనదలచినవారు పైకోర్టు వారి ఎదుట తేది: **23-02-2023 పగలు గం॥ 10.30 ని॥** లకు హాజరై వేలం పాడుకొనవచ్చును. వేలం షరతులు గూర్చి డిక్రీ హోల్డర్ తరపు న్యాయవాది వద్దగాని లేదా పై కోర్టు సూపరింటెండెంటు వారిని గాని అడిగి తెలుసుకోవచ్చును.

**AUCTION SCHEDULE PARTICULARS:**

The Vacant Site for and Extent of Ac. 0-05 Cents or 0-020 Hectors. Part of T.S.No. 49 and R.S.No. 286, Situated at Srikakulam District,Srikakulam Sub-Division, Srikakulam Muncipality, Balaga Ward, Balaga Peddaveedhi,

**Measured and bounded by:**

**Measurements: East to West:** 47 Feet (14.326) North to South: 46 Feet and 4 inches bounded by: East: The Vacant Land of Sadhu Apparao, South: The Vacant Land of Chigurapalli Sumathi, West: The Place used to go to bank of tank for this Schedule property land of Chitti Rajagopala Rao, Chitti and others & Sadu Varalaxmi and others, North: The Place used to go to bank of tank and land of Chitti Tavudu Master for this Schedule Property land of Chitti Varalaxmi and others & Sadu Varalaxmi and others.

పై హద్దులు మధ్యస్థమైన ఆస్థి వేలం కాబడును.
అమీను విలువ: **రూ.10,00,000/-**
మార్కెట్ విలువ: **రూ.19,36,000/-**
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

**మూతల చందన,**
అడ్వకేట్, మహాలక్ష్మీ నగర్ కోలనీ, శ్రీకాకుళం
.సెల్: 9059514667

# క్యాబేజీ సాగుపై పురుగు దాడి

- నాశనమవుతున్న పంట
- గణనీయంగా తగ్గిన ధర

ప్రజాశక్తి- పలాస

ఆరుగాలం శ్రమించి సాగు చేస్తున్న కూరగాయల రైతులకు నష్టాలు తప్పడం లేదు. అకాల వర్షాలతో పాటు పంటకు పురుగు పట్టడంతో పంటలు నాశనం అవుతున్నాయి. రోజురోజుకూ పెట్టుబడులు పెరగడం, ఆదాయం గణనీయంగా తగ్గిపోవడంతో పొందర రైతులు నష్టాలు ఊబిలో కూరుకు పోతున్నారు. కూరగాయల సాగే వారి వృత్తి అయినప్పటికీ కూరగాయల పంటలను అంతర పంటగా సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని బ్రాహ్మణతర్ల, పెదంచల, అల్లుకోల, పలాస, కాశీబుగ్గ, కేశుపురం తదితర ప్రాంతాల్లో వంద 100 ఎకరాల్లో వంగ, క్యాబేజీ, టమాటా, బెండ, పచ్చి మిర్చి, బీర, కాకర, చిక్కుడు, గోరు చిక్కుడు, దొండ, ఆనపతో పాటు తోట కూర, పాల కూర, కొత్తిమీర, ముల్లంగి పంటలు ఎక్కువగా సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.

క్యాబేజీ సాగుకు పురుగు పట్టింది. పంటకు డైమాండ్ బ్యాక్ మాథ్ ( పురుగు) పట్టడంతో ఆకు పూర్తిగా నాశినం అవుతుంది. 90 నుంచి 110 రోజుల పాటు జాగ్రత్తలు తీసుకున్నా పురుగు ప్రభావం దిగుబడి పై చూపుతుంది. ఎకరాకు సుమారు రూ.10 వేలు పెట్టుబడులు పెరుగుతున్నమని, ఆ స్థాయిలో ఆదాయం రావడం లేదని పొందర రైతులు చెబుతున్నారు. వాస్తవానికి ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో తేనె మంచు కురుస్తున్న తరుణంలో పంట దిగుబడి ఎక్కువగా ఉంటుందని, కానీ, పురుగు పట్టడంతో దిగుబడి బాగా తగ్గిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**తగ్గిన ధర**

క్యాబేజీ పువ్వు ప్రారంభంలో ధర బాగానే ఉండేది. దిగుబడి తగ్గడంతో పాటు ధర కూడా గణనీయంగా తగ్గిపోయిందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మూడు కేజీలు రూ.50 లు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పువ్వుకు పురుగు మందులను పిచికారీ చేస్తున్న పురుగు తగ్గుముఖం పట్టడంలేదని, మరో వైపు పువ్వుకు గిరాకీ తగ్గడంతో పంటకు పెట్టిన పెట్టుబడులూ రావడం లేదని పొందర రైతులు చెబుతున్నారు. మరోవైపు పంటలు బాగున్నాయనే సమయానికి అకాల వర్షాలు కురవడంతో పంటలు నేల మట్టం కావడం, భూముల్లో నీరు నిల్వ ఉండడంతో పంటలు కుళ్లి చనిపోతున్నయని, ఇలా ఏటా సమస్యగా మారిపోతుందని రైతులు వాపోతున్నారు.

**జాడలేని ఉద్యానవన శాఖ అధికారులు**

మండలంలోని చాలా ప్రాంతాల్లో కూరగాయల సాగు చేస్తున్నప్పటికీ వారికి పంటలపై అవగాహన కల్పించాల్సిన అధికారులు జాడే కనిపించడం లేదు. పొందర రైతులు తమ పాత పద్ధతిలో పంటలు సాగు చేయడం ద్వారా అనుకున్న స్థాయిలో పంటలు దిగుబడి రావడం లేదు. వాస్తవానికి ఉద్యానవన శాఖ అధికారులు ఉన్నారనే విషయం కూడా ఎంతో మంది రైతులకు తెలియదంటే వారి పని తీరు ఏలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ విషయంపై పలాస ఉద్యానవనశాఖ అధికారిణి సునీతను వివరణ కోరగా, కూరగాయల సాగుకు వేప నూనె ఒక మిల్లీ లీటర్లను లీటర్ల నీటిలో కలిపి పంటలపై పిచికారీ చేస్తే పురుగు పట్టడం తగ్గుతుందని చెప్పారు. దిగుబడి కూడా పెరుగుతుందన్నారు. కూరగాయల సాగు రైతులకు పంటలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

సాగు చేస్తున్న క్యాబేజీ పంట (ఇన్‌సెట్)లో పాడైన క్యాబేజీ

### పాడైపోయింది

ఏటా కూరగాయల సాగు చేస్తున్నప్పటికీ నష్టం వాటిల్లింది. అకాల వర్షాలతో పంటలు నాశినం అవుతుంది. ప్రభుత్వపరంగా ఎటువంటి ప్రోత్సాహం అందడం లేదు. విత్తనాలు సరఫరా చేయడం లేదు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి

**- పొందర చంద్రమ్మ, బ్రాహ్మణతర్లా**

### ఏటా నష్టపోతున్నాం

క్యాబేజీ పువ్వుకు పురుగు పట్టడంతో పంట నాశినమైంది. పురుగు మందులను పిచికారీ చేస్తున్నా ఫలితం లేకపోతుంది. పెట్టుబడులు పెరుగుతున్నాయి. అనుకున్న స్థాయిలో ఆదాయం రావడం లేదు. ఇదే జీవనాధారం. ప్రభుత్వం ఉచితంగా విత్తనాలు, ఎరువులు అందించాలి.

**- పొందర త్రినాథ్, బ్రాహ్మణతర్లా**

## ఏనుగులను జూకు తరలించాలి

**కొత్తూరు :** జిల్లాలో ఏనుగులు 15 ఏళ్ల నుంచి అలజడి సృష్టించి 14 మందిని పొట్టన పెట్టుకున్నాయని, వీటిని ప్రభుత్వం జూకు తరలించేందుకు చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఏనుగుల దాడిలో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, రైతులు పండిస్తున్న పంటలను నష్టపరుస్తున్నాయని అన్నారు. పాతపట్నం మండలం తిడ్డిమికి చెందిన లక్ష్మీనారాయణ అటవీ ఉద్యోగి పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం పసుకుడి వద్ద సోమవారం ప్రజలను అప్రమత్తం చేస్తుండగా... ఏనుగుల దాడిలో మృతి చెందారని తెలిపారు. అలాగే అదే మండలం తలడాకు చెందిన గోపిశెట్టి చిన్నారావు అనే రైతులు గతంలో ఏనుగుల దాడిలో మృతి చెందారని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, అలాగే ఏనుగులను జూకు తరలించాలని డిమాండ్ చేశారు.

బూర్జ : ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

## కళాశాలల్లో ఆధార్ నమోదు

**మెళియాపుట్టి :** మండలంలోని మెళియాపుట్టి ప్రయివేటు జూనియర్ కళాశాల, పెద్దమడి ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సి కళాశాల, శ్రీకృష్ణ కామాక్షి జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం ఆధార్ అప్‌డేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఆధార్ నమోదు కార్యక్రమం ఈ నెల 10 వరకు ఉంటుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ పి.చంద్రకుమారి కోరారు. ఈ మేరకు నమోదు ప్రక్రియను పరిశీలించారు.

**బూర్జ :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆధార్ కార్డుల అప్‌డేట్ కార్యక్రమం చేపట్టినట్లు ఆర్ఎంఒ సువ్వాల తవిటినాయుడు తెలిపారు. విద్యార్థులు ఆధార్ కార్డులు నమోదు కోసం ఇతర తప్పులను, సభ్యత్వ కోసం అప్‌డేట్ చేయాలని సూచించారు. విద్యార్థులకు ఎటువంటి వ్యయ ప్రయాసలు లేకుండా కళాశాలలోని ఆధార్ అప్‌డేట్ కార్యక్రమాన్ని చేపట్టామని, దీనిని సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ అనురాధ పాల్గొన్నారు.

**పలాస :** ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని జూనియర్ కళాశాల ప్రాంతంలో ఆధార్ కేంద్రాన్ని మంగలవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక నుంచి ఆధార్ కోసం ఇబ్బందులు పడనవసరం లేదని, ఎవరైనా ఆధార్ కోసం నిరంతరం అందుబాటులో ఉంటుందన్నారు. ఆయనతో పాటు మున్సిపల్ కమిషనర్ టి.రాజాగోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కను నాటుతున్న మంత్రి అప్పలరాజు

## విరివిగా మొక్కలు నాటాలి

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ మంత్రి కార్యాలయం ప్రగతి భవన ఆవరణంలో గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యాన మంత్రి సతీమణి శ్రీదేవి పుట్టిన రోజు సందర్భంగా మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, సతీమణి శ్రీదేవి మారేడు మొక్కను మంగళవారం నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలం ఎక్కువగా ఫ్రిజ్లు ఎసిలు వాడడం కంటే మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. సమాజ హితం, పర్యావరణం కోసం మొక్కలు చాలా అవసరమని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణం కాపాడాలని కోరారు. కార్యక్రమంలో గ్రీన్‌ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, కార్యదర్శి బి.టి.రావు, సభ్యులు నూకల శ్యాంసుందర్, నారాయణరావు, మందస ఎంపిపి డొక్కార దానయ్య, మాజీ కౌన్సిలర్ రోణంకి శాంతికుమారి, రమణ, పవన్ పాల్గొన్నారు.

జెండా ఊపి బస్సు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

## ఆర్‌టిసి బస్సు ప్రారంభం

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని జె.ఆర్.పురం పంచాయతీ గరికిపాలెంలో దమ్ము శ్రీను కొత్తగా ఆర్‌టిసికి అద్దెకు అందించిన బస్సును ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ జెండా ఊపి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసి లాభాల బాటలో నడిపించడంతో పాటు ప్రయివేటు వ్యక్తుల నుంచి బస్సులు అద్దెకు తీసుకుని వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌టిసి-2 డిపో మేనేజర్ శర్మ, అసిస్టెంట్ మేనేజర్ గంగరాజు, వైసిపి నాయకులు కరిమజ్జి భాస్కరరావు, జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, పచ్చిగుళ్ల సాయిరాం, దన్నాన సీతారాం, ఇడదాసుల తిరుపతిరాజు, టేకి బ్రహ్మాజీ, జె.లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరించిన రాహుల్‌కుమార్ రెడ్డి

## పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి

సమాజంలో పుస్తకాలు మనిషి విజ్ఞానాన్ని మరింతగా పెంచే విధంగా ఉంటాయని సబ్ కలెక్టర్ తాటిమూకల రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో రసాయనశాస్త్ర విభాగం అధ్యాపకులు బేపల సతీష్‌కుమార్ రచించిన పర్యావరణం రసాయన శాస్త్రం అనే పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకపక్క విద్యాబోధన చేస్తూనే, మరొపక్క విద్యార్థుల ఆలోచనా విధానానికి అర్థమయ్యే రీతిలో పుస్తకాలు రాయడం విశేషమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ మాట్లాడుతూ తమ కళాశాల్లో నిష్ణాతులైన అధ్యాపకులు ఉండడం గర్వించదగ్గ విషయమన్నారు. పుస్తక రచయిత సతీష్‌కుమార్ మాట్లాడుతూ బిఎస్‌సి తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కోసం ఎపిఎస్‌సిహెచ్ఇ సూచించిన నూతన విద్యావిధానం సిలబస్ మేరకు పుస్తకాన్ని రచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు జి.కసవయ్య, కవిత పాల్గొన్నారు.

షీల్డ్‌ను అందజేస్తున్న హెచ్‌ఎం కాసులబాబు

## జాతీయస్థాయిలో ప్రియమణి ప్రతిభ

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని పిల్లలవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని గురుగుబెల్లి ప్రియమణి అండర్-17 విభాగంలో జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు జి.రాజశేఖరరావు తెలిపారు. ప్రకాశం జిల్లా దొనకొండలో గత నెల 28 నుంచి 30 వరకు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలో పాల్గొందన్నారు. అందులో మంచి ప్రతిభను కనబర్చడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. విద్యార్థిని ఎంపికపై ప్రధానోపాధ్యాయులు సుగ్గ కాసులబాబు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

# గడప గడపకూ సంక్షేమ ఫలాలు

### శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల సంక్షేమ పథకాలతో గడపగడపలో సంక్షేమ సంతృప్తి కనిపిస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పురపాలక సంఘం పరిధిలోని 23వ వార్డు వెంకయ్యపేటలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడప గడపతో ప్రజల వద్దకు వెళ్లగలిగే సమర్థవంతమైన పాలన అందిస్తున్నామని అన్నారు. గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్ల వ్యవస్థలతో సుపరిపాలనలో దేశానికే ఆదర్శవంతమైందన్నారు. సంక్షేమ పథకాల అమలులో మధ్య దళారీ వ్యవస్థ, అవినీతిని అరికట్టేందుకు ప్రత్యక్ష నగదు బదిలీతో పాలనలో పారదర్శక విధానాలతో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో కమిషనరు కె.అప్పలనాయుడు, ఎఇ బి.సృజన, టి.పి.ఎస్. హెచ్.వి.సత్యనారాయణ, ఆర్ఐ డి.రామారావు, విద్యుత్, హౌసింగ్, టిడ్కో ఎలు జి.రామారావు, డి.సన్యాసిరావు, రమేష్ పాల్గొన్నారు.

జి.సిగడాం : సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

**హామీలన్నీ అమలు**

**జి.సిగడాం :** సిఎం జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని జాడలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. అనంతరం ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసి కాయల రమణ, జి.సిగడాం, బాతువ పిఎసిఎస్ అధ్యక్షులు ఎర్నేని ప్రకాష్, పల్లాడ సన్యాసిరావు, ఇన్‌ఛార్జి రామ్మోహనరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఆమదాలవలస : అవగాహన కల్పిస్తున్న స్పీకర్ సీతారాం

# నియోజకవర్గంలో కొండలు మాయం

### టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

పలాస నియోజకవర్గంలో పశుసంవర్థకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుతో పాటు వైసిపి నాయకులు కొండలు, గుట్టలు, చెరువులు ఆక్రమించి దోచుకుంటున్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆరోపించారు. మండలంలోని గురుదాసుపురంలో మంగళవారం రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామ పురవీధుల్లో పర్యటించి ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపి పోస్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో చెరువులు, వాగులు ఆక్రమించుకుంటుంటే, మందస మండలం నల్లబొడ్డులూరు కొండనే మింగేసినా రెవెన్యూ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. కోట్లాది రూపాయల విలువచేసే కంకర సైతం అమ్ముకుంటున్నారని విమర్శించారు. ఏడో తేదీ కావస్తున్నా ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. పేదలకు పట్టేడు అన్నం పెట్టాలని ఉద్దేశంతో చంద్రబాబు నాయుడు అన్న క్యాంటీన్ ప్రారంభిస్తే వైసిపి ప్రభుత్వం వాటిని కొనసాగించలేక మూసివేసిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుత్తుం రూపావతి, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు కుత్తుం లక్ష్మణ్‌కుమార్, దువ్వాడ సంతోష్‌కుమార్, తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, వంకల కూర్మారావు, కుమ్మరి సింహాద్రి, నీలకంఠం, వాసు, సాలిన కూర్మారావు, మురిపింటి కుమార్‌రాజు, పైల సూర్యనారాయణ పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

## దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ అనంతలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రాజెక్టు పరిధిలో ఖాళీలను వెల్లడించారు. ఈ నెల 11లోపు దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ధేశించిన రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన కమ్యూనల్ రోస్టర్ రిజిస్టర్ అనుసరించి వీటిని భర్తీ చేయనున్నట్లు చెప్పారు. దరఖాస్తులను ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని సూచించారు. నిబంధనల ప్రకారం వచ్చిన దరఖాస్తుదారులను మాత్రమే ఇంటర్వ్యూలకు పిలవనున్నట్లు తెలిపారు. స్థానిక స్థిరనివాసం కలిగిన వివాహిత మహిళా అభ్యర్థులే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని అన్నారు. 21-35 ఏళ్ల మధ్య వయసు గల వారై ఉండాలన్నారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, స్కూల్ ధ్రువపత్రం ఆధారంగా నియామకాలు చేపడతామని తెలిపారు.

నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

## కనీస కూలి వచ్చేలా కృషి చేయాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

కోటబొమ్మాళి మండలం ఎత్తురాళ్ళపడుకు చెందిన నగరంపల్లి షణ్ముఖకు ఫీల్డ్ అసిస్టెంట్ నియామకం పత్రం వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి కూలీలకు చక్కగా పని కల్పిస్తూ కనీస కూలి వచ్చేలా మస్తర్లు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎత్తురాళ్ళపడు సర్పంచ్ తలగాణ గణపతిరావు, వైస్ సర్పంచ్ తమ్మినాన కనకరవు, స్కూల్ చైర్మన్ సనపల తేజ, గ్రామ కమిటీ అధ్యక్షులు పైల భాస్కరావు పాల్గొన్నారు.

## కొత్త స్తంభాల ఏర్పాటు

**ఆమదాలవలస :** మండలంలోని వెదుళ్లవలసలో శివాలయం వీధి నుంచి ఎస్‌సి కాలనీ శ్మశాన వాటిక వరకు చీకటితో ఇబ్బందులకు గురయ్యేవారు. ప్రజలు పడుతున్న కష్టాలను గుర్తించిన సర్పంచ్ సురేష్ విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి కొత్త స్తంభాలను ఏర్పాటు చేసి వీధిలైట్లను అమర్చారు. గ్రామంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో ప్రజలందరూ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది షణ్ముఖరావు, బాల ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

నూతన స్తంభాన్ని చూపిస్తున్న సర్పంచ్ సురేష్

# సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలి

### ఎస్‌సి కార్పొరేషన్ ఇడి రామారావు

ప్రజాశక్తి- లావేరు

ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకంలో భాగంగా మండలంలోని గురుగుబిల్లి గ్రామాన్ని 2018-19లో ఎంపిక చేసిందని, ఇందులో భాగంగా వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.1.02 కోట్లు నిధులు మంజూరు చేసిందని ఎస్‌సి కార్పొరేషన్ ఇడి రామారావు అన్నారు. ఈ మేరకు గ్రామ సచివాలయాన్ని మంగలవారం సందర్శించారు. గ్రామంలో ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులు, తదితర వాటిపై సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తాగునీరు, పారిశుధ్యం పనులకు సంబంధించి రూ. 81 లక్షలు, గ్రామీణ రహదారులకు రూ.14.5 లక్షలు, విద్యుత్ శాఖ ద్వారా స్తంభాలు, వీధి దీపాలు తదితర సామగ్రి ఏర్పాటుకు రూ.3.5 లక్షలు నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. గ్రామంలో ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులపై సచివాలయ ఉద్యోగులను వివరాలు అడగగా, ఏ ఒక్కరు సరైన సమాధానం చెప్పకపోవడంతో సిబ్బంది పనితీరుపై ఇడి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైన గ్రామానికి ఏమి కావాలి, ఏ పనులు అవసరం తదితర వాటిపై నివేదిక తయారు చేయాలన్నారు. సచివాలయానికి సంబంధించి పూర్తి సమాచారం ప్రతి ఒక్కరి దగ్గర పక్కాగా ఉండాలన్నారు. ఇప్పటి వరకు గ్రామంలో రూ.5 లక్షల విలువైన పనులు మాత్రమే చేపట్టడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు చేసినప్పుడే నిధులు మంజూరవుతాయన్నారు. లేకపోతే నిధులు ఎలా మంజూరు చేస్తారన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ఎఇ ఎల్.అప్పన్న, సర్పంచ్ కళ్యాణి, లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ బి.రాంబాబు, కార్యదర్శి కిరణ్, విఆర్ఒ సత్యవతి పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న రామారావు

బూర్జ : సపర్యలు చేస్తున్న స్థానికులు

## ఇద్దరికి గాయాలు

**బూర్జ :** బూర్జ కూడలి వద్ద మంగళవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పార్వతీపురం నుంచి నరసన్నపేట వ్యాన్ వెళ్తుంది. గుత్తావల్లికి చెందిన బొడ్డేపల్లి నారాయణమూర్తి, గజ్జల శ్రీనివాసరావులు ద్విచక్ర వాహనంపై పాలకొండ వెళ్తున్నారు. బూర్జ కూడలి వద్దకు వచ్చేసరికి రెండు వాహనాలూ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. ఎస్ఐ అశోక్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**వ్యక్తికి...**

**మెళియాపుట్టి :** మండలంలోని చీపురుపల్లి వద్ద సోమవారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో పలాస మండలం రేగులపాడుకు చెందిన ఆయాతి కామయ్య గాయపడ్డాడు. పాలు అమ్ముకునేందుకు తన బైక్‌పై హీరాపురం వెళ్తున్నాడు. వెనుకగా వస్తున్న మరో బైక్‌దారుడు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వెంటనే కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఎఎస్ఐ నర్సింగరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు చేయించుకోవాలి

**ఆమదాలవలస :** పెన్షనర్లు అందరూ ఈ నెల 28వ తేదీలోగా తప్పకుండా లైక్ సర్టిఫికెట్లు చేయించుకోవాలని ఆల్ పెన్షనర్స్ అండ్ విశ్రాంత పర్సన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్థనరావు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఆధార్ కార్డుకు మొబైల్ నంబరును లింక్ చేయించుకోవాలన్నారు. ఇంటి పేరు, పూర్తి పేరు, పుట్టిన తేదీ, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో సరిగా ఉన్నది లేనిది సరి చూసుకోవాలన్నారు. అన్ని సక్రమంగా ఉన్నప్పుడే ఇకెవైసి చేయించుకోవాలని తెలిపారు. సబ్ ట్రెజరీ అధికారి కోడ్ 14008718కు ఇకెవైసి లింకు చేయించుకోవాలని, ఒకవేళ అనారోగ్య రీత్యా రాలేకపోయిన వారు వారికి సంబంధించిన కుటుంబ సభ్యులు ఎవరైనా సబ్ ట్రెజరీ అధికారిని సంప్రదించాలని తెలిపారు.

## ఎస్ఐని కలిసిన నాయకులు

**నౌపడ:** నౌపడ ఎస్ఐగా బి.లావణ్య ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు మండలంలోని పలువురు వైసిపి నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతలకు కాపాడేందుకు సహకరించాలని నాయకులను కోరారు. కలిసిన వారిలో మండల వైసిపి కన్వీనర్ కోత సతీష్, నక్క భీమారావు, పిలక రవికుమార్‌రెడ్డి, బి.మోహన్‌రెడ్డి, ఎం.సంజీవ్, బత్సల సుధాకర్, లోపింటి రాములు, కోళ్ల భాస్కరరావు పాల్గొన్నారు.

ఎస్ఐతో మాట్లాడుతున్న నాయకులు

# రూ.9.81 కోట్లతో 466 పనులు

మాట్లాడుతున్న లవరాజు

**ఇచ్ఛాపురం:** మండలంలోని గతేడాది ఉపాధి హామీ కింద రూ.9.81 కోట్లతో 466 పనులను చేపట్టామని డివిఒ బి.లవరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 21 పంచాయతీల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులపై మంగళవారం ప్రజావేదికలో భాగంగా సామాజిక తనిఖీలు నిర్వహించారు. గ్రామాల వారీగా చేపట్టిన పనులపై సామజిక తనిఖీ సిబ్బంది గ్రామస్థాయిలో తనిఖీలు పూర్తి చేశారని తెలిపారు. మండలంలో ఉపాధి హామీ కింద మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామని, ఈ తనిఖీలో చాలాచోట్ల నాటిన మొక్కలు కనిపించలేదని అన్నారు. మండలంలోని 5,750 మొక్కలు నాటితే 4,970 ఉన్నాయని, మిగిలిన 780 మొక్కలు ఎండిపోయాయని అన్నారు. దీనికోసం రూ.6.84 లక్షలు వెచ్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి నారాయణమ్మ, ప్రొసీడింగ్స్ అధికారి బి.మురళీకృష్ణ, శ్రావణకుమార్, అమ్మినాయుడు, ఎంపిడిఒ రామారావు, ఎపిఒ శ్రీనివాసరావు, ఎస్‌ఆర్‌పి సూర్యనారాయణ కె.మోహనరావు,ఉప్పాడ రాజారెడ్డి, సర్పంచ్‌లు పిట్ట మామయ్య, పాతీర్ల రాజశేఖర్‌రెడ్డి, కారింగ త్రినాథ్ పాల్గొన్నారు.

## నేడు రక్తదాన శిబిరం

**శ్రీకాకుళం అర్బన్ :** రక్తం దొరకక మృతి ఒడిలోకి చేరుతున్న చాలా మంది చిన్నారులు, పెద్దలకు రక్తాన్ని అందించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు ప్రాణదాత ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డోకి శ్రవణ్‌కుమార్ తెలిపారు. అందులో భాగంగా నగరంలోని డే అండ్ నైట్ కూడలి వద్ద ఉన్న న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకులో స్వచ్ఛంద రక్తదానం శిబిరాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ప్రాణదాత ట్రస్టు కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఏటా ఫిబ్రవరి 8న రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో తల సేమియా రోగుల సంఖ్య ఎక్కువగా ఉందని, వారికి రక్తాన్ని సకాలంలో అందించి చిన్నారులను కాపాడేందుకు శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యాన ఇప్పటికే తలసేమియా వ్యాధిగ్రస్తులైన పిల్లలను దత్తత తీసుకొని ఆదరిస్తున్నామన్నారు. ఇటువంటి చిన్నారులను రక్షించుకునేందుకు నిర్వహిస్తున్న రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా దాతలు పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. ట్రస్టు సభ్యులు పొట్నూరు ప్రతాప్, గురుగుబెల్లి చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రవణ్‌కుమార్

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

## పార్టీ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- నందిగాం

వైసిపి అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పెద్దతామరపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో సచివాలయ కన్వీనర్ల ఇన్‌ఛార్జి జె.జయరాం అధ్యక్షతన మంగళవారం నా నమ్మకం జగనన్న అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఎర్ర చక్రవర్తి, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కింతలి ధర్మారావు, మండల పార్టీ అధ్యక్షులు తమిరే ఫాల్గుణరావు, పోలాకి పోమహనరావు, పి.దేవేంద్ర రావు, ఎస్.లావణ్య, టి.బలరాం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిఎం ప్రసాదరావు

## పొదుపు నిధుల వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్వయంశక్తి సంఘాల ఖాతాలో ఉన్న పొదుపు నిధులు సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఎపిఎం ప్రసాదరావు మహిళా సంఘాలకు సూచించారు. మహిళా మండలి కార్యాలయంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకు ఖాతాలో నిరర్ధకంగా ఉన్న పొదుపు నిధులను సంఘం సభ్యులు తమ ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగించుకోవాలన్నారు. దీనిపై ఎటువంటి ఆంక్షలు లేవు అన్న విషయాన్ని ప్రతి సంఘ సభ్యులకూ తెలియజేయాలన్నారు. ఈ నెలాఖరులోగా ప్రతి సంఘం ఖాతాలో ఉన్న పొదుపు నిధులను ఉపయోగించుకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. సామాజిక పెట్టుబడి రుణాలు పొందాలంటే తప్పనిసరిగా ప్రతి సంఘం తీర్మానంతో పాటు ఆ సభ్యుల బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయించాలన్నారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విష్ణువర్ధన్ రెడ్డి

## టిడిఎస్‌పై అవగాహన పెంచుకోవాలి

**పలాస:** వ్యాపారులు టిడిఎస్‌పై అవగాహన పెంచుకోవాలని విశాఖపట్నం ఆదాయ పన్నులశాఖ అసిస్టెంట్ కమిషనర్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. పలాస క్యాషు అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం వ్యాపారులతో టిడిఎస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.10 కోట్లు వ్యాపారం చేస్తే టిడిఎస్ మినహాంచి డబ్బులు చెల్లిస్తే సరిపోతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆదాయ పన్ను అధికారి కె.బాబ్జి, ఆడిటర్ పి.వి.సతీష్, సంజీత్, మనీల్, రవితేజ, పలాస పిసిఎంఎ అధ్యక్షుడు మల్లా సురేష్, కార్యదర్శి కె.వి.శివ, కోశాధికారి రవికాంత్, ఇండస్ట్రియల్ అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్ సంఘం సభ్యులు డోకి నాగేశ్వర రావు, మల్లా భాస్కరరావు, పెంట రమేష్ పాల్గొన్నారు.

## నేటి నుంచి కోదండరామ ఉత్సవాలు

**కోటబొమ్మాళి :** మండలంలోని శ్రీజగన్నాథపురం పంచాయతీ పొడుగుపడులో ఉన్న కోదండరామ 32వ వార్షికోత్సవ ఉత్సవాలు బుధవారం నుంచి పదో తేదీ వరకూ నిర్వహించినట్లు ఉత్సవ కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాల్లో మూడు రోజులు పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. యాత్రికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# 'ఉపాధి' పనులు ప్రారంభం

వజ్రపుకొత్తూరు : ప్రారంభిస్తున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని గోవిందపురం సర్పంచ్ ప్రతినిధి పాలిన ఉమామహేశ్వరరావు సంబంధిత అధికారులను కోరారు. మండలంలోని గోవిందపురం, సీతంపేట గ్రామాల్లో ఉపాధి హామీ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొలతల మేరకు పనులు చేసి గరిష్ఠ కూలి పొందాలని అన్నారు. ఉపాధి పనులతో చెరువులు బాగుపడతాయని పేర్కొన్నారు. చెరువుల నీరు నిల్వ సామర్థ్యం పెరిగి వ్యవసాయానికి రైతులకు మేలు చేకూరుతుందన్నారు. పని ప్రదేశంలో తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ గుంట సత్యనారాయణ, గోరకల బాలరాజు, గోరు శేఖర్, డొక్కరి సవరయ్య పాల్గొన్నారు.

**పొందూరు:** మండలంలోని దల్లిపేట పంచాయతీ రెడ్డిపేటలో ఉపాధి హామీ పనులను సర్పంచ్ కంబాపు నీలవేణి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు పూటలా ఉపాధి హామీ పనులకు హాజరై గరిష్ఠ కూలీ పొందాలని కూలీలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యులు కంబాపు సూర్యారావు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉన్నత విద్యను అభ్యసించాలి

### ఆర్ఐఒ తవిటినాయుడు

మాట్లాడుతున్న తవిటినాయుడు

ప్రజాశక్తి- ఆమదాలవలస

విద్యార్థులు అత్యధిక మార్కులను సాధించి ఉన్నత విద్యను అభ్యసించాలని, అలాగే కళాశాలకు మంచి పేరును తీసుకురావాలని ఆర్ఐఒ శివ్వాల తవిటినాయుడు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 69వ వార్షికోత్సవం, వీడ్కోలు సభను ప్రిన్సిపల్ శ్యామసుందర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్ఐఒ పాల్గొని మాట్లాడారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో అధిక శాతం మార్కులను సాధించి కళాశాలను రాష్ట్రంలోని ఉన్నత కళాశాలగా నిలబెట్టాలన్నారు. కొయ్యాం కళాశాల ప్రిన్సిపాల్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను కనబరచాలని, దానికి కావాల్సిన కృషిని చేయాలని అన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారి జె.రవిబాబు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన

సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ చంద్రకుమారి

**మెళియాపుట్టి :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ఎంపిడిఒ పి.చంద్రకుమారి మంగళవారం అవగాహన కల్పించారు. గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలపై సమగ్ర సర్వే చేపట్టాలన్నారు. సర్వే వివరాలను ఎస్‌డిజి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ తిరుపతి పట్నాయక్, వెల్ఫేర్ విద్య సహాయకులు, ఎఎన్ఎంలు, మహిళా పోలీసులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

**సచివాలయం సందర్శన**

మండలంలోని పెద్దలక్ష్మీపురం గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ సందర్శించారు. ఈ మేరకు రికార్డులను, సిబ్బంది పనితీరును పరిశీలించారు. విధి నిర్వహణలో అలసత్వం చూపవద్దని హెచ్చరించారు. ప్రభుత్వ లక్ష్యాలను సకాలంలో పూర్తయ్యేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈమెతో పాటు కార్యదర్శి ప్రసాదరావు, కిరణ్, సూర్య, లక్ష్మణరావు ఉన్నారు.

## శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని రామదాసుపేటకు శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రెటరీ, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీనాయుడు, ఎంపిటిసి మజ్జి వెంకటరమణ కోరారు. ఈ మేరకు తహశీల్దార్ సనపల కిరణ్‌కుమార్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై తహశీల్దార్ స్పందించి వారం రోజుల్లో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

## రమాబాయి అంబేద్కర్‌కు నివాళి

విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న నేతలు

**శ్రీకాకుళం అర్బన్ :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భార్య రమాబాయి అంబేద్కర్ జయంతి వేడుకలు నగరంలోని జ్యోతిరావు పూలే పార్కులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ ఇండియా మిషన్ ప్రతినిధి తైక్వాండో శ్రీను ఆధ్వర్యాన ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అలాగే జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ విదేశాల్లో ఉండి చదువుకుంటున్న రోజుల్లో కుటుంబ భారాన్ని మోస్తూ పిడకలు అమ్మి వచ్చిన డబ్బుతో ఆయన చదువు మధ్యలో ఆగకుండా తన సహకారాన్ని అందించారన్నారు. పిల్లలు లేని ఆమె భారతీయులంతా తన పిల్లలేనని భావించే వారని పేర్కొన్నారు. జాతీయ ఉద్యమంలో భర్తకు చేదోడు నిలిచారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎయిమ్స్ నాయకులు పెయ్యల చంటి, సాకేటి నాయుడు, పంకు మురళి, ఈశ్వర్, రవి, మోహన్ పాల్గొన్నారు.

ఎస్.ఆర్ పురంలో కూలీలతో మాట్లాడుతున్న బృందం సభ్యులు

## పనికి తగ్గ కూలి అందుతుందా?

**జి.సిగడాం :** మండలంలోని ఎస్.ఆర్.పురం, జగన్నాథవలసలో గ్రామాల్లో కేంద్ర బృందం మంగళవారం పర్యటించింది. కేంద్ర ప్రభుత్వం ద్వారా చేపట్టిన పలు ఉపాధి హామీ పనులను మంగళవారం పరిశీలించారు. అనంతరం బృందం సభ్యులు ఆయా గ్రామ సచివాలయాల్లో గిరిజా విజయశంకర్ పాడే, సత్యరాజ్ రౌత్లు ఉపాధి కూలీతో మాట్లాడారు. ఉపాధిలో పనికి తగ్గ కూలి అందుతుందా? వంద రోజులు పని కల్పిస్తున్నారా? తదితర అంశాలపై ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయిల వివిధ పనులకు నిధులను మంజూరు చేస్తుందని, వాటిని ప్రజ అవసరాల పనులకు వినియోగించాలని అధికారులకు ఆదేశించారు. అర్హులైన వారికి కేంద్ర ప్రభుత్వ పథకాలను అందించాలని సూచించారు. కేంద్ర పథకాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ చిట్టిరాజు, ఎపిఒ సిహెచ్.సత్యనారాయణ, జెడ్‌పిటిసి కె.రమణ, కంది రమాదేవి, మాజీ వెంకటరమణ పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న చిరంజీవి నాగ్

## బాధితులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని మునగవలస పంచాయతీ సంతకొత్తవలసలో సోమవారం రెండు పూరిల్లు దగ్ధమైన విషయం పాఠకులకు విదితమే. విషయం తెలుసుకున్న వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ బాధితులను మంగళవారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. కష్టపడి సంపాదించుకున్న నగదు, దుస్తులు, వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయని బాధితులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు చిరంజీవి నాగ్ బాధిత కుటుంబాలకు రూ.20 వేలు నగదు అందజేశారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన సాయాన్ని అధికారులతో మాట్లాడి త్వరితగతిన అందేవిధంగా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆలయాల్లో పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని ఆలయాల్లో పరిశుభ్రత పాటించాలని దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత ఆలయ అధికారులకు సూచించారు. జిల్లాలో ఆలయాల పరిశీలనలో భాగంగా మండలంలోని పెద్దజగన్నాథస్వామి ఆలయాన్ని మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆలయంలో జరుగుతున్న నిత్య పూజలు, ఉత్సవాలను అడిగి తెలుసుకున్నారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని మేనేజర్ బి.రామారావుకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎండోమెంట్ సూపరింటెండెంట్ కుమార్, ఇన్‌స్పెక్టర్ బి.ప్రసాద్, ఆలయ అర్చకులు ఎస్.ఎన్.రామప్రసాద్, రామకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుజాత